

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 21 | జూలై, ఆగస్టు, 2024 | సంచిక : 2, 3

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)**
**ప్రచార సారథ్యం :**
**శ్రీ బి. గోపీకృష్ణ**
**శ్రీమతి బులుసు జయ**

**సాయివాణి చందా వివరాలు**

2 సంవత్సరాలకు చందా........రూ॥200/-
10 సం.రాలకు చందా........ రూ॥1000/-

**చిరునామా :-**

**సాయివాణి**

**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** | **పుట సంఖ్య**

మా వాణి .......... 2
గురువు-సాధన .......... 5
రమణాశ్రమంలో .......... 7
మంత్ర మహిమ .......... 8
అశ్రు తర్పణం .......... 10
శ్రీ సాయినాథ ఏకాదశ .......... 11
కాషాయ వర్ణం .......... 13
జ్ఞానోదయమే జీవనసాఫల్యము 14
సాయిభక్త దాసగణు .......... 17
శాశ్వత ధర్మగోప్త .......... 19
ద్వారకామాయి చిత్రపటం .......... 22
శ్రీ సాయి నిత్య పారాయణ .......... 23
మాతృసంస్థ కబుర్లు .......... 25
శ్రీ కోదండ రామ సాయి .......... 31

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



స్వరాజ్యం, స్వతంత్రం, గణతంత్రం - యిలాటి మాటలన్నీ గత అరవై నాలు గేళ్లుగా నూరున్నర కోట్ల భారతీయుల నోళ్లలో నాని నాని జీర్ణమై పోయాయి. ఇంతకీ మనకు స్వాతంత్ర్యం వచ్చినట్లేనా? - అని అనేకులకు సందేహం. “వచ్చింది స్వరాజ్యం - కావలసింది సురాజ్యం” అన్నారు ఆనాటి నాయకులు. మన ప్రణాళిక ప్రకారం, మన పద్ధతికి లోబడి మనం బ్రతకటం స్వతంత్రం. పరిపాలనా రీతి మనదిగా మన సంస్కృతీ సంప్రదాయాలతో చేసుకొని, స్వేచ్ఛగా బ్రతకగలిగితే స్వరాజ్యం వచ్చినట్లు. మనమంతా ఒకటే గణంగా - ఒకే గుంపుగా ఐకమత్యంగా జీవిస్తూ, ఒకే ప్రణాళికాబద్ధంగా ఉంటే గణతంత్రం.

పై మూడు ముక్కలకూ మనం అర్హులమేనా? మనకంటూ ఒక రీతి, ఉపాయం, పద్ధతి ఉన్నాయా? ఏ క్షణాన ఏ దేశానికి కోపం వస్తుందో అని గజగజలాడుతూ ఉండటం స్వతంత్రమా? ఏ దేశం మన నాయకులను అవమానించినా, మన దేవతలపై ఛండాలపు బొమ్మలు వేసినా-చివరికి ఆ బొమ్మలు వాళ్ల పాకీ దొడ్లలో కమోడ్ మూతల మీద, కాళ్ల క్రింద నలిగే చెప్పల మీద వేసినా “ఏమిటీ వెధవచేష్టలు?” అని గట్టిగా కోప్పడగల గుండెలు మనకు లేవు. అవతలివాడి సంపదనీ, వాడికున్న ఆయుధసంపత్తినీ, ప్రపంచంలో వాడికున్న పలుకుబడినీ దృష్టిలో ఉంచుకొని, చేతులు నలుపుకొంటూ మెత్తమెత్తగా “మీరిలా చెయ్యవచ్చునా మహాప్రభో!” అన్నట్లు మాట్లాడటం స్వతంత్ర దేశ లక్షణమా? స్వాతంత్ర్యానికి నిర్వచనం స్వాభిమానరాహిత్యమా?

ఇక - ఇది మన రాజ్యం అనుకోవాలంటే మనవైన సంస్కృతీ సంప్రదాయాలు, మన కళలు, మన భాషలకు గౌరవం, మన విద్యలకు విలువ ఉండాలి. మన మాన్యతకు దెబ్బ తగిలితే అవతలి సహకారాన్ని తిరస్కరించి, వాళ్ల మొహాన్నకొట్టిట్లుగా ఆయా పరికరాలనో, మందులనో ఆహారాన్నో ఆయుధాలనో మనవే అమర్చుకోగలగటం అన్న స్వావలంబన మనకుండాలి. అదెక్కడైనా కన్పిస్తున్నదా? స్వరాజ్యమంటే పరుల మోచేతి నీళ్లు దొరకవేమోనన్న పిరికితనమా? మన యువతీ యువకులదుస్తుల్లో, మన జీవనవిధానాల్లో, పండగపబ్బాల్లో, మన కళాశాలల విద్యలు మొదలు మన ప్రైమరీ విద్య వరకూ ఉన్న అన్నిస్థాయిల విద్యల్లో, కనీసం మన ఆహారవిహారాల్లోనైనా-యుగయుగా లుగా విశ్వవిఖ్యాతమైన మన కుటుంబవ్యవస్థలోనైనా సరే-మన సంస్కృతీ విలువలు కన్పిస్తున్నాయా? ఎవరో కొద్దిమంది తప్ప న్యాయదేవతకు ప్రతిబింబాల మని చాటుకొనే కోర్టులు మొదలు-దైవానికి ప్రతినిధులమని చెప్పకొనే సాధువుల ఆశ్రమాల వరకు (చర్చి నిర్వహణలు, మహమ్మదీయ, మత సంస్థలు) కూడా యిందులోకే వస్తాయి) ధనార్జనే పరమావధిగా బ్రతుకుతుంటే- ఇంద్ర భవనాలు, బంగారం దిమ్మలే లక్ష్యాలుగా చేసుకుంటే ఎక్కడున్నది మన భారతీయత? ఏదీ మన స్వరాజ్యం?

మన దేశంలోని ప్రజలందరికీ ఒకే పాలన ఉన్నదా? అందరికీ సమానమైన పౌరహక్కులు లభిస్తున్నాయా? ఒకే మేధస్సు ఉన్న వారందరికీ ఒకే మాదిరి సౌకర్యాలు, ఉద్యోగాలు, విద్య లభిస్తున్నాయా? స్వాతంత్ర్యం వచ్చిందని మనమను కొంటున్న అర్ధశతాబ్ది తరువాత మిగిలిందేమిటయ్యా అంటే - నాటి సంపన్న కులాలు నేటి దరిద్రపౌరులతో నిండగా-నాటి దళితులనబడిన వారికి కూడా గొప్ప న్యాయమేమీ జరక్కపోగా -





అధికారుల ధనం బలవటం. కులవివక్ష తొలగించటం కోసం- స్త్రీలను రక్షించటం కోసం పెట్టిన వ్యవస్థలు, చట్టాలు, వారి క్షేమానికి మాత్రమే కాక- వారు చెలరేగి కక్ష తీర్చుకోను దారితీసే దాకా ఎదిగిపోతున్నాయి. ముస్లిములకు ఒక న్యాయవ్యవస్థ, హిందువులకొక న్యాయ వ్యవస్థ ఎందుకుండాలి? ఇది మతాతీత రాజ్యాంగమైనప్పడు మతాలవారీగా వెసులుబాట్లు, రిజర్వేషనులు ఎందుకుండాలి? ఈ విధానాలన్నీ దేశాన్ని నిలువుగా అడ్డంగా చీల్చలేదా? అసలీ వైషమ్యాలను పెంచి పోషిస్తున్నది రాజకీయ వ్యవస్థ కాదా? దానికి కారణం ఓటు బ్యాంకులకిది మూలాధారంగా ఉండటమే గదా! ఇదే నా గణతంత్రమంటే? కాదు గదా!

ఇందుకోసం కాదు మన తాతలు తమ జీవితాలు ధారపోసింది. వాళ్లే గనుక ఇప్పడీ నేల మీదికి వస్తే రూపురేఖలే కాదు, శీల స్వభావాలు కూడా మార్చుకొంటున్న యీ నేలతల్లిని చూస్తే ఈమె భారతమాత కానే కాదని ఆ షాక్‌తో మరోసారి చస్తారు.

ఇప్పటికైనా జనత కళ్లు తెరవాలి. క్షణం క్షణం మన యువతపై, మన సంస్కృతిపై పరచుకొంటున్న మాయాజాలాన్ని ఛేదించటానికి పూనుకోవాలి. తమదైన ఒక్క బిల్డింగ్ మీద దాడి జరిగితే ఒక దేశాన్నే ఛిన్నాభిన్నం చేయగల దేశాలను చూచైనా సిగ్గు తెచ్చుకోవాలి.

మన పూర్వప్రభువుల స్వాభిమానాన్నీ, స్వావలంబనను, సంస్కృతినీ తిరిగి తెచ్చుకోవాలి. ఏ జాతి తన సంస్కృతిని పోగొట్టుకొంటుందో ఆ జాతి నశించిపోతుందన్న విషయాన్ని పదేపదే మననం చేసుకోవాలి. మన స్వతంత్రం, మన గణతంత్రం యింకా హీన, క్షీణ, దీన, దౌర్భాగ్య స్థాయికి చేరకుండా ఉండటానికి సమైక్యతతో కృషి చెయ్యాలి. “అర్ధరాత్రి స్వతంత్రం వచ్చింది ఇంకా తెల్లవారలేదు” అన్న వెక్కిరింతను రద్దు చేయాలి. తథాస్తు!

# గురువు-సాధన

- శ్రీ తెలికచర్ల సుబ్రహ్మణ్య శర్మ

గురువు యొక్క మహత్తర ఉపయోగముల గురించి "త్రిపాద్విభూతి మహా నారాయణోపనిషత్తు" అను గ్రంథములో ఈ విధముగా చెప్పారు.

"తస్మాత్సద్గురు కటాక్షలేశ విశేషేణ సర్వ సిద్ధయ స్సిధ్యన్తి
సర్వబంధాః ప్రవినశ్యన్తి శ్రేయో విఘ్నాస్సర్వే పళయం యాన్తి
సర్వాణి శ్రేయాంసి స్వయమేన ఆయాన్తి
యథా జాత్యన్ధస్య స్వరూప జ్ఞానం న విద్యతే తథా।
గురూపదేశేన వినా కల్పకోటి శతైరపి తత్త్వజ్ఞానం నజాయతే
తస్మాత్సద్గురు కటాక్ష లేశ విశేషేణా చిరాదేవ
తత్త్వజ్ఞానం భవతి యథా సద్గురు కటాక్షో భవతి
తథా భగవత్కథా శ్రవణ ధ్యానాదౌ శ్రద్ధా జాయతే,
తస్మా ద్ధృదయ స్థితానాది దుర్వాసనాగ్రన్థి వినాశో భవతి
తతో హృదయస్థితాః కామాస్సర్వే వినశ్యన్తి
తస్మాద్ధృదయ పుండరీక కర్ణికాయాం పరమాత్మా విర్భావో భవతి"॥

సద్గురువు యొక్క కటాక్షలేశ విశేషముచే సమస్త సిద్ధులు సిద్ధించును. సకల బంధములు నశించును. శ్రేయో విఘ్నములన్నియు తొలగిపోవును. శ్రేయములన్నియు స్వయముగా వచ్చి చేరును. జాత్యంధునకు స్వరూప జ్ఞానము లేనట్లు, గురూపదేశము లేనిచో వందల కోట్ల కల్పములకైనను ఆత్మ జ్ఞానము కలుగదు. సద్గురు కటాక్షము పొంది తత్త్వజ్ఞానమును తెలుసుకొన వలెను. అప్పుడు భగవత్కథా శ్రవణ, ధ్యానాదుల యందు శ్రద్ధ జనించును. దానిచే హృదయమందలి సమస్త దుర్వాసనలు, కామాదులు నశించును. అటు తరువాత హృదయ పుండరీకమందలి పరమాత్మ యొక్క సాక్షాత్కారము కలుగును.





"మాతృదేవో భవ, పితృ దేవో భవ, ఆచార్య దేవోభవ" - అన్న శృతి వాక్యాను సారము మనకు జన్మనిచ్చు తల్లి దైవముతో సమానము. మనకు స్వశక్తి వచ్చు వరకు అన్ని విధములుగా పెంచి, పోషించు తండ్రి దైవముతో సమానము. అలాగే మనకు జ్ఞానమును ఒసంగి, మనలోని అజ్ఞానాంధకారమును తొలగించి, ఆత్మజ్ఞాన మార్గము వైపు నడిపించు గురువు దైవముతో సమానమని తెలియుచున్నది.

ఈ ముగ్గురిలో గురువు శ్రేష్ఠుడు. ఎందుకనగా, మాతా పితరులు కేవలం భౌతికదేహాన్ని ప్రసాదించి పోషిస్తున్నారు. గురువు మాత్రం ఇహపర సుఖాలనే కాక, జనన మరణ దుఃఖాల నుంచి విముక్తిని పొందే "స్వస్వరూప ఆత్మబోధ"ను చేస్తారు. ఇక్కడ గమనించవలసిన సూక్ష్మవిషయం ఏమిటంటే - జన్మకారక, పోషకులైన తల్లిదండ్రులను, జ్ఞానబోధకుడైన గురువును గౌరవించి, ఆరాధించ కుండ, అలక్ష్యం చేసి, భగవంతుని ఆరాధించడం అవివేకమే అవుతుంది.

పాంచభౌతికమైన యీ శరీరాలు, యీ వైభవాలు అన్నీ అశాశ్వతాలే. మరణం లేని వారంటూ ఎవరూ లేరు. మృత్యుదేవత సదా వెన్నంటే ఉంటుంది. ఏ క్షణంలోనైనా వయస్సుతో నిమిత్తం లేకుండా యీ శరీరం రాలిపోతుంది. ఎంతో అమితంగా ప్రేమించే యీ శరీరం, భార్యాబిడ్డలు, గృహము, ధన ధాన్యాదులు, బంధుమిత్రులు, అన్నీ అశాశ్వతాలే. ఈ సత్యాన్ని గుర్తుంచుకుని ధర్మాచరణ ఒక్కటే ముఖ్య కర్తవ్యముగా జీవితాన్ని సాగించటం ఉత్తమమైన మార్గము. దేని మీద మమకారం పెంచు కుంటామో, దానివల్లనే దుఃఖాన్ని పొందటం జరుగుతుంది. మాయకు లోబడిన వారికి ఆత్మజ్ఞానము కలుగదు- సరికదా - అహంకారము వృద్ధి చెంది, సదా దుఃఖం కలుగుతుంది. ఆత్మజ్ఞానం పొందిన వారికి పరమోత్కృష్టమైన ఆత్మానందం కలిగి మోక్షం సిద్ధిస్తుంది.

ఈ ఆత్మజ్ఞానం పొందాలంటే మనో నిగ్రహము చాలా అవసరము.

**(సశేషం)**

# రమణాశ్రమంలో

- పులిచర్ల ఆదినారాయణ

ఒక సాధువు వచ్చి భగవాన్‌తో ఈ విధంగా ఫిర్యాదు చేసారు "ఆశ్రమంలో ఉన్న మీ శిష్యులు గురువు కంటే మిన్నగా అధికారము చెలాయిస్తున్నారు. నేను భోజనము పెట్టండని పలుసార్లు అడిగాను. వారు పెట్టడం లేదు నన్ను పట్టించుకోవడం లేదు. ఇది చాలా వింతగా ఉన్నది. 'అన్ని దానముల కంటే అన్నదానము గొప్పదని' స్వామి వివేకానంద చెప్పారు", అంటూ వేదాంత సిద్ధాంతాలను ఏకరువు పెట్టారు.

ఆయన భగవాన్ను, ఆశ్రమాన్ని విమర్శిస్తుంటే నాకు కోపము వచ్చినది. నేను కల్పించుకొని "భగవాన్ను మీరడిగేది ఏమిటి? ఆశ్రమములో వినే వారున్నారు. వెళ్ళి వారికి చెప్పండి" అన్నాను. భగవాన్ అయిష్టంగా నావైపు చూశారు. నేను అంతటితో ఊరుకున్నాను.

మరల ఆ సాధువు ఉపన్యాసము మొదలుపెట్టారు. కొంతసమయానికి అయిపోయింది. అప్పుడు భగవాన్ అతనితో "అంతేనా! ఇంకా ఏమైనా ఉందా?" అన్నారు. అందుకు సమాధానము లేదు.

భగవాన్ అతనితో "చూడండీ! నేను ఇక్కడ ఏ పనీ చేయకనే భుజించడం లేదు. ఏ పనీ చేయనిదే ఆశ్రమము వారు భోజనము పెట్టరు. అందుకే నేను రోజూ కూరగాయల తరగడం, గోవులను చూచుకోవడం, వచ్చిన భక్తులకు దర్శనమివ్వడం, వారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం యిత్యాది పనులు చేస్తాను. అందుకే వారు నాకింత అన్నం పెడుతున్నారు. మీరు ఏ పనీ చేయకనే భోజనము కావాలంటే ఎవరైతే మాత్రము ఎంతకాలము పెట్టగలరు చెప్పండి" అంటూ జాలిపడి నావైపు చూచి "ఏమి చేసేది? ఈయనను తోడ్కొనిపోయి భోజనము పెట్టించండి" అని అన్నారు. ఒకరిని విమర్శించే ముందు ఇది ఉచితమా? అనుచితమా? అని విచారణ చేయాలని భగవాన్ సందేశము.





# మంత్ర మహిమ

– కంచనపల్లి వేంకట కృష్ణారావు

మంత్రాలు నిజంగా మహత్తు లేక శక్తిగలవా? మంత్రాలకు మహత్తు లేక శక్తి తప్పక ఉందంటున్నారు పండితులు - మంత్రాన్ని సవ్యంగా పలకాల్సిన విధంగా పలికితే, ఆయా మంత్రాలకు ఉన్న మహత్తు తప్పక ఫలిస్తుంది. మంత్రం కూడా పద్యం వలెనే ఛందస్సుతో నిర్మింపబడితే పూర్తిగా మనస్సును మంత్రం మీద పెట్టి సరిగ్గా ఉచ్చరిస్తే అద్భుత ఫలితముంటుంది. వేదమంత్రాలను, దైవ కార్యాలకు సంబంధించిన మంత్రాలను నిత్యం పలికే వారి ముఖాలలో ఒక విధమైన కళ ఉంటుంది.

మంత్రాల్ని "వేదమంత్రాలు" "పురాణమంత్రాలు" "తాంత్రిక మంత్రాలు"గా విభజించవచ్చు. వీటిలో కూడా "సాత్వికమంత్రాలు" "రాజసిక" "తామసిక" మంత్రాలు ఉంటాయి.

సాత్విక మంత్రాలు భగవంతుని ప్రసన్నం చేసుకొనేందుకు, శక్తి, యుక్తి, జ్ఞానాన్ని పెంపొందించుకొనేందుకు పనికి వస్తాయి. రాజసిక మంత్రాలు భౌతిక ఫలితాలు పొందేందుకు ఉపయోగపడతాయి! తామసిక మంత్రాలు ఇతరులకు నష్టం కలిగించడానికి, తాంత్రిక విద్యలకు, చెడు కార్యాలకు పనికి వస్తాయి. ఇవి క్షుద్ర మంత్రాలు. వీటి వలన పాపం తప్ప ఏమీ మిగలదు.

మంత్రాలను గురుముఖంగా నేర్చుకోవడం మంచిది. అసలు మంత్రాలన్నీ "ఓం" కారం నుండి ఉద్భవించాయి. అందుకే అనేక మంత్రాలకు ముందర "ఓం" ఉంటుంది. 'ఓం'కారం ధ్వని నుండే ఈ అంతరిక్షం, ప్రపంచం పుట్టిందని వేదాలు చెబుతున్నాయి. వైద్యపరంగా చూచినా

‘ఓం’కారం రోజూ ఉచ్చరిస్తే గుండె సంబంధిత, శ్వాససంబంధిత వ్యాధులు దరిచేరవు.


మన వేదాలు, పురాణాలు మన బాగు కోసం ఎన్నో మంత్రాలు ఇచ్చాయి. గాయత్రీ మంత్రం జ్ఞానసిద్ధి కోసం, మృత్యుంజయ మంత్రం చావు, రోగాలను తప్పించుకోవడం కోసం, ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో మంత్రాలు ఉన్నాయి.

సరిగ్గా మంత్రాన్ని పఠిస్తే, ఆ మంత్రధ్వనితరంగాలు నలువైపులా వ్యాపించి పరిసరాలకు కూడా ఎంతో మేలు చేస్తాయి. కొన్ని మంత్రాల ఉచ్ఛారణ వలన కలిగే ధ్వని తరంగాల వలన బాక్టీరియా వంటి క్రిములు నశించడమే కాకుండా, శరీరం రోగనిరోధక శక్తిని కూడా పొందుతున్నట్లు పరిశోధనల్లో తేలింది! కానీ, ఈ ఉరుకుల, పరుగుల జీవితంలో అనేకమంది మంత్రాలు సరిగ్గా ఉచ్చరించలేక పోతున్నారు. దాని వలన ఏదైనా లోపం రావచ్చునేమో అని, ప్రతి పూజ లేక మంత్రసంబంధ కార్యక్రమం అయిపోయాక - “మంత్రహీనం, క్రియాహీనం, భక్తి హీనం ..............” వంటి అపరాధ క్షమాపణా స్తోత్రాలను కూడా మన పెద్దలు మనకు ఇచ్చారు. అందుకే మంత్రాలను తేలిగ్గా తీసిపారవేయరాదు. ఈ మంత్ర సంస్కృతిని కాపాడి మన భావి తరాల వారికి యివ్వవలసిన బాధ్యత మంత్రం మీద పూర్తి అవగాహన గల వారికి ఉన్నది. ఇన్నిటినీ మించి ఇష్టదైవ నామాన్నే మంత్రంగా ఉచ్ఛ్వాసనిశ్వాసాలతో కలిపి జపించటం కలియుగంలో వ్యాప్తిలోకి వచ్చింది. శ్రీ సాయి నామం వంటి సులభ సాధ్యమై, సద్యో ఫలితాన్నివ్వగల మంత్రాలు కూడా యీనాటి సామాన్య భక్తులకు ఎంతో ఉపకరిస్తున్నాయనటం నిర్వివాదం.





# అశ్రుతర్పణం



సాయిధామం సేవాశ్రమం స్థాపన నుండి ఆశ్రమానికి మంచి అభిమానులు, గురుదేవులకు, మాతాజీ గార్కి మంచి శిష్యులు, శ్రీ సాయి విద్యాధామం పాఠశాల ప్రారంభంలో ప్రధానోపాధ్యాయులుగా సేవలందించిన సాయి భక్తులు, స్నేహశీలి, నిగర్వి, ప్రభుత్వ ఉద్యోగిగా సేవలందిస్తూనే ఆశ్రమ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ భక్తుల మనసులు గెలుచుకున్న నిరాడంబరుడు. ఆశ్రమ అభివృద్ధి కోసం ప్రతి నెల కొంత గురుదక్షిణ పంపిస్తూ, గురుదేవుల సంపూర్ణ ఆశీస్సులు అందుకొనే మా యల్లాప్రగడ భాస్కర ప్రసాద్ గారు (54 సంవత్సరాలు) ఆగస్టు 1వ తేదీన గురు సన్నిధికి చేరి పోయినారనే వార్త మాకు ఇంకా జీర్ణం కావటం లేదు.

ఆశ్రమ వాసులందరికీ ఎంతో వేదన కల్గించింది. వారి శ్రీమతి శ్రీలక్ష్మిగారికిక, పిల్లలు - హర్ష, సంతోష్‌కూ తదితర కుటుంబ సభ్యులందరికీ ఆశ్రమం తన సహానుభూతిని, ఆర్ద్ర నయనాలతో తెలియజేస్తూ శ్రీ భాస్కరప్రసాద్ గారి ఆత్మకు శ్రీ సాయినాథుల వారు శాశ్వత శాంతిని కలిగింతురు గాక! అని సాయివాణి ప్రార్థిస్తున్నది.

# శ్రీ సాయినాథ ఏకాదశ సూత్రములు

- దొంతికుర్తి సుబ్రహ్మణ్య కామేశ్వర విజయశర్మ.
ద్వారపూడి

(శ్రీ సాయినాథుల వారు భౌతిక శరీరం చాలించి శతాబ్దికాలం గడిచింది. అయినా ఆయన సజీవులే. "నాకు మరణమెక్కడిదిరా!" అన్నారు దామోదర్‌తో. "సదా నేను అప్రమత్తుడినే. మీరు పిలిస్తే చాలు నా సమాధే జవాబు చెప్తుంది. సర్వకార్యాలూ అక్కడి నుండే నెరవేరుస్తాను" అని కంఠోక్తిగా వాగ్దానం చేసారు. అలాంటి మహాత్ముడు - సాక్షాత్తూ దైవమే తానైన మూర్తి చేసిన ఏకాదశ వాగ్దానాలకిది ఒక భక్తుని వ్యాఖ్య. - సంపాదకులు)

**1. షిరిడీ ప్రవేశమే సర్వ దుఃఖ పరిహారం.** షిరిడీ ఒక ద్వారక. ఆనాడు ద్వారకలో శ్రీ కృష్ణుని సాంగత్యం చేత నాటి భక్తులు ఎంతో ఆనందాన్ని అనుభవించారు. ఆ ద్వారకలో ఉన్నంతవరకు వారు మరి ఏ చింతలకు గురి అయ్యే వారు కాదు. ఆ ద్వారకంతటి మహిమాన్వితమైనది యీ షిరిడీ. సాయి ద్వారక వెళ్లే భక్తులతో "మీ ద్వారక ఇది కాదా!" అని అనేవారు. అటువంటి షిరిడీలో ప్రవేశించాలేగానీ సర్వదుఃఖాలు పరిహారమవడం తథ్యం.

**2. "ఆర్తులైననేమి, నిరుపేదలైననేమి ద్వారకామాయి ప్రవేశమొనరించి నంతనే "సుఖసంపద"లందగలరు".**

ధనవంతులైనా, నిరుపేదవారైనా సరే సాయి దర్బారులో అంతా





సమానమే.

అక్కడ వారి మధ్య ఎటువంటి భేదాన్ని చూపించే వారు కాదు బాబా. అంతేగాక అక్కడ చేరిన వ్యక్తుల్లో కూడా అటువంటి ఆలోచనకు తావిచ్చేవారు కాదు. ఐశ్వర్య వంతులైనా, కటిక దరిద్రులైనా ఆ ద్వారకలో ప్రవేశించగానే సుఖసంపదలు పొందుతారు. ఇక్కడ "సుఖసంపద" అంటే భోగపూరితమైన, విలాసవంతమైన జీవనం కాదు. ఈ పదాన్ని నిశితంగా పరిశీలించి చూద్దాం. సుఖమంటే ఏమిటి? ఒక వ్యక్తి సుఖంగా ఉండడమంటే పట్టుపరుపులు, పంచభక్ష్యపరమాన్నాలు, సుందర భవనాలు, ధనసంపద ఉంటే ఆ వ్యక్తి సుఖంగా ఉన్నట్లా? అటువంటివారు లోకంలో ఎంతోమంది ఉన్నారు. వారంతా సుఖంగా ఉన్నవారేనా? కారనే చెప్పాలి.

ఒక మనిషి సుఖంగా ఉన్నాడనడానికి అర్థమేంటి? ఒకే ఒక సమాధానం "మనశ్శాంతి". ఇది మనం ముందు చెప్పకున్న విలాసవంత జీవితాల్లో ఉందా? "అన్నీ ఉన్నాయి కానీ మనశ్శాంతి లేదండీ" ఇది తరచూ వింటూ ఉంటాం. ఇది ఒక్కటి లేకపోతే మనకెన్ని ఉన్నా మనం దరిద్రులతో సమానమే. ఈ మనశ్శాంతి ఒక్కటి లభిస్తే ఆ జీవి తనలో తానే ఎంతో ఆనందాన్ని అనుభవించగలుగుతాడు. ఇది పేదవారికైనా, ధనవంతుల కైనా, ఒకే విధమైన అనుభూతి కల్గిస్తుంది. ఇది ప్రత్యేకంగా ఏ ఒక్కరికో సంబంధం ఉన్నది కాదు. అందరిదీను. మరి ఈ మనశ్శాంతి ఎక్కడ దొరుకుతుంది? ఒక భగవత్ సన్నిధానంలో, ఒక సద్గురువు సాంగత్యంలో. మనఃపూర్వకంగా ఈ ద్వారకా మాయిలో ప్రవేశించాలేగానీ వాడు ఆర్తుడైనా, నిరుపేద అయినా వారికి సుఖమనే సంపద, మనశ్శాంతి అనే సంపద సమానంగా అందుతాయి- ఆ సంపదను అందుకోగలరు అని బాబా చెప్పిన యీ రెండవ సూత్రానికి అర్థం.

**(సశేషం)**

# కాషాయవర్ణం - రామతీర్థుల వారి ప్రబోధం

- స్వామీ రామతీర్థ

సన్యాసులు ధరించే కాషాయం అగ్నిని సూచిస్తుంది. అది అగ్ని యొక్క రంగు. ఈ రంగు వస్త్రాలు ధరించినవారు తమ దేహాన్ని త్యజించినవారు. సత్యాన్వేషణకై ప్రాపంచిక విషయాలను విషయ వాసనలను, ఆశలను, కోరికలను, వ్యామోహాలను అగ్నికి ఆహూతి చేసినవారు.

అగ్ని ప్రాణాన్ని పోషిస్తున్నది. అగ్ని చైతన్య శక్తి కలిగి ఉంటుంది. ఈ వస్త్రాలు రెండు విషయాలను సూచిస్తాయి. మొదటిది తామసికమైన, స్వార్థపూరితమైన, సంకుచితమైన వాటన్నింటిని ఆహుతి చేయటం, నశింపజేయటాన్ని సూచిస్తుంది. అగ్ని దహించివేస్తుంది, రెండవది అగ్ని చైతన్యానికి, ప్రాణానికి, శక్తికి ఆధారం కాబట్టి చైతన్యానికి శక్తికి ప్రతిరూపం అగ్ని.

అధమమైన దానిని త్యజిస్తేనే ఉత్తమమైనది లభిస్తుంది. ఓహో! ఈ ప్రపంచంలోని మానవాళి తమ జీవితాన్ని ఒక అంధకారంగా మృత్యుపాశంగా, బందిఖానాగా మారుస్తున్నారు. వారి హృదయాలపై భయము, బాధ, దుఃఖము అనే హిమాలయ పర్వతాన్ని పెట్టుకొని భారంగా జీవిస్తున్నారు. చిరునవ్వు, కన్నీళ్ల మధ్యలో కొట్టుమిట్టాడుతున్నారు ఊహాజనితమైన నరకాన్ని సృష్టిస్తున్నారు. వేదాంతం మన యీ అధమ జీవితాన్ని వదలమని హితముపదేశిస్తుంది. శరీరాన్ని నరకకూపంలా మార్చే అహంకారాన్ని స్వార్థాన్ని జ్ఞానం అనే అగ్నిలో ఆహుతి చేయమని ఉద్బోధిస్తుంది. అగ్ని జ్ఞానానికి ప్రతీక.

భారతదేశంలోని శ్రేష్ఠమైన ఋషి, సన్యాసి మరియు ఉదయించే సూర్యుడు ప్రతిరోజు మనకు ఇదే వర్ణంలో దర్శనమిస్తారు. కాషాయం యీ దేశపు ఆత్మను ప్రతిబింబిస్తుంది.





# జ్ఞానోదయమే జీవన సాఫల్యము

- వల్లభనేని కుటుంబరావు

**(గత సంచిక తరువాయి)**

ఉన్నట్లయితే అతనిని విమర్శించే హక్కు మనకు లేదు. అందుకే ఒక వ్యభిచారిని వీధుల్లోకి లాక్కొచ్చి రాళ్లతో కొడుతుంటే జీసస్ క్రీస్తు "మీలో తప్పు చేయనివారు మాత్రమే రాయి వేయండి" అన్న వెంటనే అందరూ ఆపివేసారు. జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు, ఒక తప్పు అందరం చేసిన వాళ్లమే.

7) మనం జీవితాన్ని ఒక డ్రామాగా, నటనగా భావించి జీవించాలి. కానీ వాటిలో లీనమవకూడదు. ఇది శాశ్వతం కాదు అనే భావన ఉండాలి.

8) మీరు ధ్యానంలోకి వెళ్లి పరిశీలన చేసుకోండి. మీ భావాల మీద మీరు గతంలో చూపిన భావోద్రేకాల మీద ధ్యానం చేస్తే మీకు చాలా స్పష్టత వస్తుంది-ఎక్కడ తప్పు చేసారని. అందుకే శారీరక ఆరోగ్యానికి, మానసిక ఆరోగ్యానికి, మోక్షానికి రోజూ ధ్యానం చేయుట అవసరం.

9) ధ్యానం ద్వారా అనేక ఆలోచనలు ముఖ్యంగా కర్మఫలాలు నశించి పోతాయి. మనస్సుకు ప్రశాంతత లభిస్తుంది.

10) ధ్యానంలో సానుకూల దృక్పథమైన ఆలోచనలు చేస్తే ప్రతికూల ఆలోచనలు పోతాయి.

11) ముఖ్యంగా దీర్ఘశ్వాస ..... మంచి ఫలితాలను ఇస్తుంది.

12) ముఖ్యంగా మీరు పాటించాల్సింది చాలా యోగులు చెప్పింది, యోగానందు కూడా చెప్పారు. "మనం ప్రేమించినవారు, అభిమానించిన వారు చనిపోయినప్పుడు తీవ్రంగా ఏడ్చినా బాధపడినవారు అధోగతి

పాలవుతారు. పొరపాటున కూడా ఏడ్వకండి. మీరు నీ శరీరం లేకపోయినా నేను నిన్ను మిక్కిలి సంతోషంతో ప్రేమిస్తూనే ఉంటాను అనే భావన తెలియజేయండి. మీ ప్రేమభావన స్వీకరించి ఉన్నత లోకాలకు వారి ఆత్మ పయనిస్తుంది. మీ ప్రేమ చైతన్యాన్ని పంపండి, అవి చేరుతాయి.

13) మనిషి చనిపోయిన 8 గం.ల వరకు శరీరంలోంచి మనస్సు పోదు. ఈలోపు శరీరాన్ని మంచం మీద నుంచి క్రిందికి చాప మీద పెడితే, మనస్సు చాలా చిరాకుగా ఉంటుంది. ఆ చిరాకుతో మళ్ళీ జన్మ ప్రారంభమవుతుంది. కాబట్టి 8 గం.ల వరకు శరీరాన్ని అదే స్థానంలో ఉంచాలి.

14) స్వామి యోగానంద అంటారు "మనిషి పుట్టుకతోనే శరీరంతో గుర్తింపబడతాడు. శరీరాన్ని పోషిస్తాడు. శరీరానికి కష్టం రానివ్వడు. శరీరమే తాను అనుకొంటాడు. దీనవలన బాధ అనుభవిస్తాడు, ఇది అజ్ఞానం". రెండవది - చెడు పనుల వలన ఫలితం బాధ. మూడవది పూర్వజన్మ కర్మఫలాల వల్ల బాధ. ధ్యానం ద్వారా వీటిని అధిగమించవచ్చు అంటాడు.

15) మీరు ఎప్పడూ మీ మనసులో ఇది నా కర్మ, పూర్వజన్మలో ఎవరికి ఏ పాపం చేసానో అనేమాట మీ నోట రానీయకండి. ఇలా ఎప్పడు మాట్లాడకూడదు. ఎప్పడూ చెడుకర్మను మీరు అంగీకరించకండి. మీ మంచికర్మలు, మీ చెడుకర్మలను నాశనం చేస్తాయి. మంచి కర్మలు చేయండి. రెండింటి కర్మఫలం భగవంతునికిచ్చేయండి-మీరు ప్రశాంతంగా ఉండండి.

"కాయేన వాచా మనసేంద్రియైర్వా
బుద్ధ్యాత్మనా వా ప్రకృతేః స్వభావాత్ ॥
కరోమి యద్యత్ సకలం పరస్మై
నారాయణాయేతి సమర్పయామి॥" అనండి - నిద్రపోయే ముందు.





మీరు ఎప్పడూ నేను బాగున్నాను, భవిష్యత్తులో కూడా నేను బాగానే ఉంటాను అనుకోవాలి. నేను బాగాలేను, నాకు రోగం నయం కాదు, నాకు సుఖం లేదు, సంతోషం లేదు, ఎప్పడూ ఏదో ఒక సమస్యే, గొడవలు అని పొరపాటున కూడా అనుకోవద్దు. ఇవి అచేతన మనస్సులో చేరి అవే జరిగేటట్లు చేస్తుంది.

16) సబ్‌కాన్షియస్ మనస్సు : మన లోపలున్న కణాలు, నరాలు వాటికి అంటే మనస్సుకు ఇచ్చే సంకేతాలకు అనుగుణంగా పనిచేస్తాయి. జ్వరం వచ్చింది, తగ్గిపోతుంది తగ్గిపోతుంది అనుకోవాలి. అంతేగాని అది కరోనా జ్వరం తగ్గదు, చనిపోతాను అనుకుంటే నిజంగానే అలానే జరుగుతుంది.

మీ మనస్సుకు ఎల్లప్పడు సానుకూల ఆలోచనలుండేటట్లు సాధన చేయండి. జీవితంలో చిన్న చిన్న విషయాలు పెద్దవిగా ఆలోచించి జీవితం మొత్తం పాడు చేసుకోకండి. అది జీవితంలో ఒక భాగం మాత్రమే. అదే జీవితం కాకూడదు.

కొందరు ఏ కాస్త ఆరోగ్యం బాగా లేకపోయినా హడావుడి పెట్టేస్తారు. సాధారణ జలుబు, చెవినొప్పి, దగ్గు, జ్వరం - అసలు వీటిని పట్టించుకోక పోతే అవే పోతాయి. అలాగే గ్యాసు పైకి వస్తే గుండె జబ్బు అని భయ పడటం మానాలి. మదిలో ఏముంటే గతిలో అదే జరుగుతుందంటారు.

17) ప్రతి మనిషికి వైబ్రేషన్స్ ఉంటాయి. కొందరికి సానుకూలంగా మరికొందరికి ప్రతికూలంగా ఉంటాయి. మీరు మీ సానుకూల ప్రకంపనా లను అంటే దైవికప్రేమ, కరుణ, దయ, సహనం, స్నేహం అనే భావాలను ఇతరులకు మీ హృదయం నుండి, ఆలోచనల ద్వారా పంపించండి.

మీ అందరి పట్ల నేను నా హృదయం నుండి సానుకూల ప్రకంపన లను పంపిస్తుంటాను. అదే గురువు చేసేది.

**(సశేషం)**

# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

**(గత సంచిక తరువాయి)**

ఆ.వె. పనులు జేయు నెడల పరమాత్మ సాయీశు
మనసు నందు నిల్పి మసలు వాని
అన్య భావ మేది ఆలోచనల లేక
నమ్మి కొలుచు వారి నావ యతడు 16

ఆ.వె. సాధనొండు వలదు సాయీశు డుండంగ
వేద పఠన మేల వేత్త యవగ
గురిగ గురుని గొల్చి గుర్తించి నీబాట
పరమ పథము గనగ పయన మగుము 17

ఆ.వె. ధ్యేయ ప్రాప్తి గలుగు దీక్షతో ధ్యానించ
నాత్మ లందు నెపుడు నలరు వాని
సక్త రహితు డగుచు సర్వేశు పరమాత్మ
సగుణ నిర్గుణంబు సమ్మతంబు 18

తే.గీ. ధ్యానము ధ్యేయమున్ గన ధ్యాత కొక్క
టవఁగ చైతన్య మందున నవధరించి
బ్రహ్మమందు తా నేకత బరగు నతడు
కచ్ఛపము వోలె గురుడును గాంచుచుండ 19





ఆ.వె. నిన్ను జేరవచ్చు నెవ్వరైనను గాని
పూర్వ పరిచయంబు మొదలె లేక
రాను గాక రారు రమ్మని పిలచినా
అట్టి వారి నెల్ల నాదరించు 20

కం. సతులు సుతులు చుట్టా
లు తల్లి దండ్రియు ఋణాను రూపంబగుటన్
సతత ధ్యేయాసక్తిన
గతబద్ధుడగుచు ప్రణాళికానుగుణమునన్ 21

ఆ.వె. ప్రియము భక్తి యుతము శ్రేయంపు కోరిక
వాలిన తలతోడి వందనంబు
వికస మొందజేసి విశ్వేశు వానికి
కాంతి కలుగ జేయు భీతి వలదు 22

ఆ.వె. సర్వ శక్తి మంతు, సర్వముఁ దానైన
పరమ శివుని నీవు భక్తి గొలువ
మార్గ దర్శనంబు మసలుచు నీవెంట
జేరి నిన్ను జేర్చు చెంత గురుని 23

తే.గీ. మది దలచె రాత్రి హేమాడు మరుదినమున
నామపు స్మరణయు కీర్త నములు జేయ
మజ్జిదును జేర వినిపించె మహిమ, సాయి
చెంత ఔరంగ బాద్ కరు చేరి పాడ 24

తే.గీ. సమయ మాసన్న మవగానె సాయిబాబ
యెచట యెప్పడు యెవరని యెంచకుండ
బోధనల మార్గ నిర్దేశ హితవు గఱపు
నింద జేసిన వానిని నిలపి జెప్పె 25

**(సశేషం)**

శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

విదురుని రథం వచ్చి ఆగింది. అతడు రథావరోహణం చేస్తుంటే పాండవులైదుగురు ఎదురువెళ్లి స్వాగత సమాశ్వాసనాలు పలికారు. మర్యాదలు, అటూ ఇటూ యోగక్షేమాదుల కుశలప్రశ్నలు ముగిసిన తరువాత, ఆయన రాకను గురించి యుధిష్ఠిరుడడిగాడు.

'పిననాయనగారూ! ఏమిటి ఇలా అనుకోకుండా మామీద దయ చూపారు?'

ఏమి చెప్పను పెదనాయనా! అని ధృతరాష్ట్రునికీ తనకూ మధ్యన జరిగిన సంగతి యావత్తూ వివరించాడు. 'నేను ఉభయపక్షాలకు, కురు రాజ్యానికి, లోకానికి ఏది హితకరమో అదే చెప్పాను. రోగి అపథ్యాన్నే కోరుతాడు గదయ్యా, ఉత్తములైతే నిన్ను ఆదరిస్తారు'.

'మరి పెదనాయనగా రేమన్నారు!'

'ఆయన నేత్రాలు ఎలాగూ గ్రుడ్డివే, పుత్రవ్యామోహంలో బుద్ధి కూడా గుడ్డిదవుతుందయ్యా. నేను చెప్పిన మాటలకు మండిపడి 'నీవు మాకు శత్రువవు. తక్షణం నా ముందు నుంచి వెళ్లిపో. తిరిగి నీ ముఖం చూపకు' అన్నాడు. ధర్మజా! కౌరవులు ధర్మదూరులు. కురు రాజ్యం వారికి దక్కడం కల్ల. ఈ పదమూడేండ్లు క్లేశానికి చలించవాకండి. ఈ కురురాజ్య భారాన్ని పూనగల అర్హత నీకు తప్ప మరెవరికీ లేదు. కురు రాజ్యభారం కేవలం అధికారం చేజిక్కించుకోడం కాదు. అది ఎవరికీ స్వంతసొత్తు కాకూడదు. కురునృపతులు మొదటినుండీ ధర్మరక్షణ, తమ కర్తవ్యంగా నిలబడ్డారు. నీ తమ్ములూ, నీవూ ధర్మస్వరూపులు, మీరే కురువంశ ప్రతిష్ఠను నిలప





గలుగుతారు".

ఆ అడవిలో ధర్మరాజు సన్నిధిలో సజ్జన సాంగత్యం విదురునికి పరమానందదాయకమైంది.

❖ ❖ ❖

## 12. మైత్రేయుని శాపం

అలా రోజులు గడుస్తున్నవి.

హస్తినలో దుర్యోధనుని ప్రభుత్వం ప్రారంభమైంది.

శకుని యంత్రాంగం, దుశ్శాసనుని దండనీతి, కర్ణుని సలహా, విదురుడు లేడు. సంజయునికి దుర్యోధనుని వద్ద చోరవ లేదు. భీష్మ, ద్రోణ, కృపాదుల జోక్యానికి అవకాశం లేదు. కురుశ్రేష్ఠులకు, పౌర, జానపద ప్రముఖులకు పిలుపులు లేవు. వీతరాగ తపస్సుల మార్గదర్శనాలు అక్కర లేదు. కురురాట్సభా సమావేశాలు లేవు. నిర్ణయాలు సభలో జరుగవు.

దుర్యోధనుని నిరంకుశాధికారం నడుస్తున్నది.

ధృతరాష్ట్రునికి కూడా ఎక్కడ ఏమి జరుగుతున్నదో చెప్పే మనిషి లేడు. ఇన్నాళ్ళు విదురుడు తనకు చెవిగా, చూపుగా హితుడై, ఆప్తుడై ఉండేవాడు. ఇక తన గుండె బాధను ఎవరిముందు ప్రకటించుకోగలడు? తనకు హితవచనం చెప్పి, హితమార్గం చూపగల ఏకైక మిత్రుడు, నిర్భయశీలం గలవాడు, సత్యవాది, యోగపురుషుడు, తన తోబుట్టువు విదురుడు అలా వెళ్లిపోవడం ధృతరాష్ట్రునికి మతిపోయినంతైంది. పైగా విదురుడు వెళ్లి పోయినాడంటే లోకం కూడా తనను నిందిస్తుంది. అటు యుధిష్ఠిరునికి విదురుని వల్ల మహానైతికశక్తి లభిస్తుంది.

విదురుడంటే కౌరవ రాజ్యమంతటా పరమాదరం ఉన్న మహామంత్రి. దీనులకు, ఆర్తులకు సేవ చేయడంలో నిరంతరం మనసిచ్చిపాటుబడే వాడు. నిజంగా బాధితులకు అతడే శరణ్యం. అలాంటి విదురుణ్ణి కూడా మహారాజు బహిష్కరించాడనే అపవాదు క్రమంగా వ్యాపించింది. ఈ

వార్త అంతఃపురంలో, అభ్యంతర గృహాలలోకి కూడ ప్రాకింది. ధృతరాష్ట్రుడు మరే దుష్పరిణామం సంభవిస్తుందోనని భయపడ్డాడు.

పోగా విదురుని చారులు రాజ్యమంతటా విస్తరించి ఉన్నారు. విదురుడు పాండవులతోటే ఉంటే ఇంటి గుట్టు, కుట్రలు ఎప్పటికప్పుడు పాండవులకు తెలుస్తాయనే భయం కూడా ధృతరాష్ట్రునికి పుట్టింది. ఈ భయంతో ఎలాగైనా విదురుణ్ణి బుజ్జగించి తిరిగి రప్పించుకోవాలి. మరి ఎవరిని పంపించాలి? నిర్మలుడు, అర్జునునికి మిత్రుడు, నిష్పక్షపాతి, ధర్మం గలవాడు సంజయుడు. తన కంతరంగ సచివుడు. సంజయుణ్ణి పంపితే ఎవరికీ ఏ అనుమానం ఉండదని తీర్మానించి, అతణ్ణి పిలిపించాడు.

'సంజయా! నా తమ్ముణ్ణి, పరమ నిదానస్తుడైన విదురుణ్ణి దూరం చేసుకొని, పాపానికి ఒడికట్టుకున్న వాణ్ణయ్యాను. అతడు లేనిదే హస్తినలో ధర్మదేవత నిలవదు. నాకు అతడు ఆరవ ప్రాణం. అతడు లేకపోవడాన నేను రిక్తుణ్ణయ్యాను. నీవు వెంటనే వెళ్లి బలవంత పెట్టైనా నా పక్షాన ఒప్పించి రాజధానికి తీసుకొని రమ్మన్నాడు.

సంజయుడు కామ్యకవనానికి వెళ్లి, ధర్మరాజాదులను చూచి విల విలలాడాడు. ద్రౌపదిని చూచి అతని మనస్సు వికలమైంది.

ధర్మరాజాదులను పరామర్శించాడు. ధౌమ్యుల వారికి, సాష్టాంగంగా నమస్కరించాడు. ద్రౌపదిని మన్నించి, హితవు పలికి, అగ్నులు ప్రేలుస్తున్న శ్రోత్రియుల బృందానికి నమస్సులర్పించాడు.

'ధర్మరాజా! వనవాసంలో కూడా త్రిభువన సామ్రాజ్యం ఏలుతున్నంత ఆనందం మీ ముఖాన కనిపిస్తున్నది. నీవు స్థితప్రజ్ఞుడవైన మహాత్ముడవు. విదురుల వారు ఇక్కడికి వచ్చినప్పటి నుండి మహారాజుగారు అస్వస్థ మతులైనారు. వారు తమ తమ్ముణ్ణి వెంటనే తీసుకొని రమ్మని నన్ను పంపారు. విదురుల వారు లేకపోవడంతో ఆయన లోలోన కుమిలిపోతు న్నా'రని మనవి చేశాడు.

**(సశేషం)**





# ద్వారకామాయి చిత్రపటం

**- యిమ్మిడిశెట్టి ప్రభాకరరావు, హైదరాబాదు**

షిరిడీలోని ద్వారకామాయిలో ధునికెదురుగా వెండి సింహాసనం మీద చిత్రపటం వుంటుంది. ప్రస్తుతం వున్న చిత్రపటం సాయి సశరీరులుగా వున్నప్పుడు గీసిన చిత్రానికి నకలు. అసలు చిత్రం బాబా అంగీకారంతో, ఆనాటి ప్రఖ్యాత చిత్రకారుడు శ్యామారావ్ జయకర్ బాబాను చూస్తూ గీసినది. ఆ అపురూప చిత్రపటం ధుని వేడిమికి, వాతావరణ కాలుష్యానికి పాడయ్యే అవకాశం వుండటంతో సంస్థాన్ వారు దాన్ని సాయి మ్యూజి యంలో భద్రపరచి, భక్తులు దర్శించే అవకాశం కల్పించారు. ప్రస్తుతం వున్న చిత్రపటాన్ని పరికిస్తే అసలు చిత్రానికి ఏమాత్రం తీసిపోదు అనిపిస్తుంది. దానికి కారణం ఆ చిత్రం గీయడానికి వెనుకనున్న అసాధారణమైన సాయిలీల!

1990వ సంవత్సరంలో హైదరాబాదులో నివసించే ప్రఖ్యాత చిత్ర కారుడు జ్యోతిరాజాగారు కొందరు మిత్రులతో కలిసి షిరిడీ వెళ్లారు. అదే ఆయన మొదటిసారి షిరిడీ వెళ్లడం. వారు ద్వారకామాయి సమీపంలో నున్న పూజ్యశ్రీ శివనేశన్ స్వామిని దర్శించారు. స్వామీజీ కళ్లు మూసుకొని ధ్యానంలోకి వెళ్లి, కొంతసేపయ్యింతర్వాత జ్యోతిరాజాగారి వంక చూస్తూ, 'బాబాగారు మిమ్మల్ని తమ చిత్రం గీయమంటున్నారు. ఆయన సంకల్పం ఏమిటో మరి! మీకిష్టమైతే గీసి వెళ్లండి" అన్నారు. ఈ స్వామికి తానొక చిత్రకారుణ్ణని ఎలా తెలిసింది అని ఆశ్చర్యపోయారు జ్యోతిరాజాగారు. ఇంతలో టెంపుల్ రిసీవర్‌గారు అటుగా వచ్చారు. శివనేశన్ స్వామి వారి నుంచి విషయం తెలుసుకొని జ్యోతిరాజాగారితో, ఇదివరలో సంస్థాన్

వారు శ్యామారావ్ జయకర్ చిత్రించిన తైలవర్ణ చిత్రం కాలానుగతంగా రంగులు వెలవెల పోతున్నందువల్ల మరొక చిత్రం గీయించాలనుకొన్నారు. చిత్రకారులకు ఆహ్వానాలు పంపించారు. బొంబాయి నుండి జైపూర్ నుండి ఇద్దరు చిత్రకారులొచ్చారు. లక్ష రూపాయల రెమ్యూనరేషన్ అడిగారు. సంస్థాన్ వారు అంగీకరించారు కూడా. ఎందుకనో వారు మళ్ళీ రాలేదు. కారణం తెలియదు" అన్నారు. "నాకు ఏ రెమ్యూనరేషన్ అవసరం లేదు. ఆ చిత్రం గీసే భాగ్యం బాబా నాకెందుకిచ్చారో! ఈ సేవ చేయడమే నా అదృష్టం. మరల పది రోజులలో వస్తాను" అంటూ తిరిగి వచ్చారు జ్యోతిరాజాగారు.

జ్యోతిరాజాగారి చెల్లెలు 7, 8 సంవత్సరాల నుంచి కంటి రెటీనా వ్యాధితో బాధపడుతుంది. ప్రఖ్యాత వైద్యుల వద్ద చికిత్స చేయించారు. చివరిగా సరోజినీ కంటి ఆసుపత్రిలో చూపించారు. రెటీనా స్పెషలిస్టు డాక్టరు సత్వతిగారు "ఈ వ్యాధి నివారణకు మందు లేదు. అయినా వ్యాధి ముదరకుండా మాత్రం చూడొచ్చు. మీరు మద్రాసులోని శంకర నేత్రాలయంలో పరీక్ష చేయించండి" అని సలహా ఇచ్చారు. తాను షిరిడీ వెళ్ళే లోపలే చికిత్స చేయించాలనే ఆలోచనతో ఆయన తన సోదరిని తీసుకొని మద్రాసు వెళ్ళారు. అక్కడ హొటలులో రూము తీసుకొని హాస్పటల్‌కు వెళ్తూ, "బాబా, నీ చిత్రం గీస్తానని షిరిడీ సంస్థాన్ వారికి మాట ఇచ్చాను. నా మాట నిలబెట్టుకొని నీ సేవ చెయ్యాలంటే నాకు మనఃస్థిమితం కావాలి. భారం అంతా నీదే. ఏం చేస్తావో నీ దయ" అని ప్రార్థించాడు. హాస్పిటల్‌లో మొదటి కౌంటర్‌లో పేరు నమోదు చేయించి, రెండవ కౌంటర్లో ఎమర్జెన్సీ కేసుగా రిజిష్టరు చేయించి వెళ్ళి హాలులో కూర్చొన్నారు. ఇంతలో ఒక అపరిచిత వ్యక్తి తిన్నగా జ్యోతిరాజాగారి దగ్గరి





కొచ్చి, ఏమిటి ప్రాబ్లమ్ అని వివరాలన్నీ అడిగి తెలుసుకొన్నాడు. తిన్నగా డాక్టరు వద్దకు తీసుకువెళ్ళి, అవసరమైన టెస్టులు చేయించారు. రిజల్ట్స్ తీసుకొచ్చి, మిగతా డాక్టర్ల వద్దకు కూడా తీసుకువెళ్ళి సహాయం చేశాడు. మూడవ రోజున ఆసుపత్రి సూపరింటెండెంట్ మేరీ అబ్రహామ్ వద్ద అపాయింట్‌మెంట్ కూడా తీసుకొని ఆమె వద్దకు తీసుకువెళ్ళాడు.

ఆమె రిపోర్టులన్నీ చూసి, "ప్రఖ్యాత వైద్య నిపుణులైన డాక్టర్ శివారెడ్డిగారు, డా॥ సత్వతిగారు కూడా మీకు రెటీనా ప్రాబ్లమ్ వుందని డయాఫ్రం వేసి ధృవపరిచారు. ఈ జబ్బుకు ఇంతవరకు ఎక్కడా నివారణ లేదు. కానీ మా టెస్టు రిపోర్టుల ప్రకారం మీ కంటికి ఏ జబ్బూ లేదు. మీరు మందులు కూడా వాడవలసిన అవసరం లేదు. మీరు ఆనందంగా ఇంటికి వెళ్ళండి. ఇది అరుదైన అద్భుతం. ఏదో మహాద్భుత దైవశక్తి మీ వ్యాధిని నివారించింది" అన్నారు. ఆశ్చర్యం, ఆనందం పెల్లుబికి రాగా జ్యోతిరాజాగారు అంతవరకు గత మూడు రోజులుగా వారికి సహాయ పడిన హాస్పిటల్ స్టాఫ్ కరువయ్య గారిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అతడు కొంచెం ఆశ్చర్యంగా, "నేనెందుకు మీకిలా సహకరించానో నాకర్థం కావడం లేదు. అసలలా చెయ్యడానికి మా హాస్పిటల్ నిబంధనలు అనుమతించవు. ఏ దైవశక్తి ప్రేరణతో నేనిలా చేశానో ఏమో" అన్నారు.

వారం రోజుల తరువాత జ్యోతిరాజా గారు షిరిడీ వెళ్ళి భక్తి పారవశ్యంతో అసలు చిత్రానికి ధీటైన నకలు గీశారు. ఈనాడు ద్వారకామాయిలో వున్న చిత్రమిదే! సాయీ ప్రభువు ఎవరినీ ఏ సేవకు నియోగిస్తారో ఎవరిని ఏ రకంగా అనుగ్రహిస్తారో ఎవరికెరుక!

జై సాయిరాం!

**- సేకరణ : షిరిడీలో సిరులు గ్రంథం నుండి**

# మాతృసంస్థ కబుర్లు

జూన్ 23 కారుణ్య సాయి ప్రభు మందిర 9వ వార్షికోత్సవ సందర్భంగా ఆలయ నిర్వాహకులు డా॥ ఎల్. విజయకుమారి గారి ఆహ్వానం మేరకు సాయిదత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు కార్యక్రమంలో పాల్గొని దేవాలయాల విశిష్టత గురించి, దేవాలయాలు ఎందుకు సంస్కార కేంద్రాలుగా నిలిచాయో వివరించారు. మానవుని లౌకిక, పారమార్థిక విషయాలన్నిటికీ దేవాలయాలు తోడ్పడుతూ, జాతికి గుండెతో సమానంగా విలసిల్లి పారమార్థిక జీవితాన్ని మలుస్తూనే ఐహిక జీవితాన్ని కూడా తీర్చిదిద్దే కేంద్రాలుగా ఉండేవి ఈ దేవాలయాలు. ఒకవేళ ఇవి చిన్నభిన్నమైతే జాతి జీవనమే అస్తవ్యస్తమవుతుంది. జాతిని సంస్కరించి సచ్ఛీలురుగా, సనాతన ధర్మం పట్ల ఆదరాభిమానాలు కల దేశభక్తులుగా మలచడం మన తక్షణ కర్తవ్యం అని బోధించారు.

జూలై 17వ తేదీ హైదరాబాద్ నాగదేవత ఎల్లమ్మ దేవాలయం నిజాం పేటలో హనుమాన్ చాలీసా పారాయణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్వామీజీ వారు పాల్గొని హనుమంతుని గొప్పతనాన్ని గురించి పిల్లలకు, యువతరానికి ఆదర్శంగా నిలిచే గొప్ప దైవం ఆంజనేయ స్వామి, తాను ఎంత గొప్ప వ్యక్తి అయినా తనను తాను శ్రీరామచంద్రునికి అర్పించుకున్న గొప్ప భక్తుడు, నిజాయితీగా తన దైవానికి లొంగిపోయినప్పుడే మనలోని అహం నాశనమవుతుందని వివరించారు.

జూలై 20వ తేదీ ఉదయం 11 గంటలకు విజ్ఞాన్ ప్రభోదానంద ప్రశాంతి నికేతన్ పాఠశాల కొండాపూర్ యాజమాన్యం వారి ఆహ్వానం





మేరకు గురుపూర్ణిమ ఉత్సవంలో స్వామీజీ వారు పాల్గొన్న సందర్భంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులను ఉద్దేశించి గురువు యొక్క విశిష్టతను తెలియజేశారు.

20వ తేదీ సాయంత్రం ఉద్దమర్రి గ్రామంలో శ్రీ సాయి సచ్చరిత్ర సామూహిక పారాయణ సందర్భంగా శ్రీ నెల్లుట్ల ఆంజనేయులు గారి గృహంలో ఏర్పాటు చేసిన సాయి పూజా, పారాయణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని సచ్చరిత్ర పారాయణ వల్ల కలుగు ఫలితాలను గురించి వివరించి, వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు.

ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజును గురుపూర్ణిమ అని మరియు వ్యాస పూర్ణిమ అని కూడా అంటారు. వేదవ్యాస మహర్షి జననం కూడా ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజునే కనుక ఆయన పేరిట ఈ రోజు గురుపూర్ణిమ జరుపుకుంటున్నాం. మనలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించి, విజ్ఞానాన్ని ప్రసాదించే వారే గురువులు.

ఈ సంవత్సరం జూలై 21వ తేదీ గురుపూర్ణిమ నాటికి సాయిధామం ద్వారవతి దేవాలయంలోకి శ్రీ సాయినాథుల వారు, శ్రీ దత్తాత్రేయులు వారు వేంచేసి ప్రతిష్ఠ జరిగి 28 సంవత్సరాలు నిండుతున్నందున నిర్వహించుకొనే వార్షికోత్సవాలలో ఎడతెరిపి లేని వానను లెక్క చేయకుండా వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ద్వారవతి సాయిదేవాలయమును వివిధ పూలాలంకరణతో శోభాయమానంగా అలంకరించారు. ప్రభాతవేళ శ్రీ సాయినాథుల వారికి కాకడ హారతి మరియు గం.6.00 లకు క్షీర, జలాభిషేకాలు, నమకం, చమకం, రుద్రంతో సాగినాయి. గం.7.30 ని.లకు ప్రధాన పూజ నిర్వహించడం జరిగింది. గం.10.00లకు వివిధ పుష్పాలతో సహస్ర

నామార్చన కార్యక్రమం ఎంతో వైభవంగా జరిగింది. పూజానంతరం బాబా వారి ముగ్ధమనోహర రూపాన్ని భక్తులు తన్మయత్వంతో దర్శించి తరించారు.

ఆధ్యాత్మిక విద్యలో మార్గనిర్దేశం చేసి అభివృద్ధి పథం వైపు చూపేవారు గురువులు. మానసిక జ్ఞానోదయానికి స్వీయ సాక్షాత్కారానికి సహాయపడే వ్యక్తి, విలువలు, అనుభవ జ్ఞానాన్ని నింపేవాడు, జీవిత పరమార్థాన్ని తెలిపే వారు గురువులు. అటువంటి మార్గ నిర్దేశకులైన శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ సత్యపదానంద ప్రభుజీ వారికి పాదుకా పూజా కార్యక్రమం ట్రస్టు సభ్యులైన డా॥ జి.చంద్రారెడ్డి, శ్రీ బి. గోపీకృష్ణ గారలు నిర్వహించారు.


అనంతరం స్వామీజీ భక్తులనుద్దేశించి భక్తులనుద్దేశించి సద్గురువులు ఎలా ఉంటారో వివరించారు : "అజ్ఞాన మనే అంధకారాన్ని తొలగించి జ్ఞానాన్ని కలిగించే వారే గురువులు. మాయా జగత్తులో ప్రవేశించి అజ్ఞానంతో, భవబంధాలలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్న జీవులను బంధ విముక్తుల చేసే సన్మార్గాన్ని చూపి జీవిత పరమార్థాన్ని తెలిపేవారే సద్గురువులు. వారికి మనం ఇచ్చే గురుదక్షిణ ఏమంటే వారు చూపిన సన్మార్గంలో నడవడమేనని" బోధించారు. అనంతరం భక్తులందరూ గురుదేవుల ఆశీస్సులందుకొని మధ్యాహ్న హారతిలో పాల్గొన్నారు.

ఇట్టి కార్యక్రమంలో వర్షాలు భారీగా పడుతున్నప్పటికీ 900 మందికి పైగా భక్తులు శ్రీ సాయినాథుల వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఈ కార్యక్రమానికి ఆర్థికంగా, హార్థికంగా సహకరించిన భక్తులందరికీ శ్రీ సాయినాథుల వారి పరిపూర్ణ ఆశీస్సులు కలగాలని సాయివాణి మనసారా కోరుకుంటుంది.







# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

(గత సంచిక తరువాయి)

"మాటలు చెప్పినంత సులువు కాదు. అమృతానుభవంలోని ఏదయినా ఓవికి అర్థం చెప్పగలవా? సంవత్సరాలకు సంవత్సరాలు కష్టపడితే కానీ అది సాధ్యం కాదు" అని దాదామహారాజ్ ఆవేశంగా అడిగారు.

"మాటలతో చెప్పడం కాదు, అమృతానుభవం మీద టీకానే వ్రాసి చూపిస్తాను" అని దాసగణు చాలా పట్టుదలగా బదులిచ్చాడు.

"అలా వ్రాయాలంటే. నీవు నా వద్ద కొంతకాలం ఉండి అందులోని అర్థాన్ని ఆకళింపు చేసుకోవాలి. అప్పడే నీవు వ్రాయగలుగుతావు" అని దాదామహారాజ్ అన్నారు.

"మీ దగ్గరకు రావాల్సిన అవసరం లేదు. శ్రీ సాయిబాబా కృపతో నేను వ్రాయగలుగుతాను" అని దాసగణు సమాధానమిచ్చాడు.

"బాగుంది. ఆ ముస్లీం ఫకీర్ నీకు వేదాంతమేమి బోధిస్తాడు? సంవత్సరాల తరబడి అమృతానుభవం మీద ప్రవచనం చేస్తున్న నేనయితేనే నీకు సరయిన అర్థం బోధించగలను" అని దాదామహారాజ్ అన్నారు. ఒక విధంగా "నీవు ఆ టీకా వ్రాయాలంటే నేనే దిక్కు" అని పరోక్షంగా పలికారు.

కానీ, దాసగణు స్వభావం వేరు. తనది ఎవరికీ తలవంచే స్వభావం కాదు. అందులోను, అవతలి వారిలో తనకు నచ్చని గుణం కనిపిస్తే, వారిని ఎంతమందిలోనయినా, ఎంత మాట అనడానికయినా వెనుకాడడు. సరిగ్గా, అప్పడూ అలానే జరిగింది.

"ప్రతి ఒక్కరు నా వద్దకు రావాలి అనుకునే మీలాంటి అహంకారి వేదాంతసారాన్ని ఏమి బోధించగలరు. సద్గురు సాయిబాబా దయతోనే

నేను ఆ కార్యాన్ని విజయవంతంగా పూర్తి చేస్తాను” అని దాదామహారాజ్ ముఖం మీదనే చెప్పేసి, దాసగణు అక్కడ నుండి నిష్క్రమించాడు.

ఇంటికి వచ్చి, వెంటనే బజారు నుండి అమృతానుభవం గ్రంథాన్ని తెప్పించాడు. ఆ గ్రంథాన్ని స్నేహితుడు మరియు శిష్యుడు అయిన విశ్వనాథ్ బడవేకు ఇచ్చి “విశ్వనాథ్ ఈ గ్రంథాన్ని తీసుకువెళ్ళి (పండరీపురంలోని) పాండురంగని కుడిచేతి మీద పెట్టు. (పాండురంగ విఠలుడు రెండు చేతులను నడుము భాగంపై వేసుకొని నిలబడియుంటారు. కుడిచేతికి ఉదరభాగానికి మధ్య పెట్టమని దాసగణు ఉద్దేశ్యం) ఉదయాన్నే వెళ్ళి చూస్తాను. ఒకవేళ గ్రంథం క్రింద పడిపోకుండా ఉంటే, ఆ పాండురంగని ఆశీస్సులు ఉన్నాయని భావించి, గ్రంథ రచన మొదలుపెడతాను. ఒకవేళ క్రింద పడిపోతే ఆ ఆలోచనను వదలి వేస్తాను” అని చెప్పాడు. ఆ ప్రకారం గానే కార్తీక శుద్ధ ఏకాదశినాడు సాయంత్రం ఆ గ్రంథాన్ని గర్భగుడిలోని పాండురంగని కుడిచేయి మీద ఉంచారు. ఆ రోజు ఎంతో విశేషమైన దినం కావడం వలన వేల సంఖ్యలో భక్తులు పాండురంగని దర్శనానికి వచ్చారు. కొన్ని వేల పూలహారాలను పాండురంగని మెడలో వేయడం, తీయడం జరుగుతుంది. అయినాసరే, ఆ పుస్తకం పాండురంగని చేతి నుండి క్రింద పడలేదు. అప్పుడు ఆ గ్రంథ రచనకు భగవంతుడి ఆశీస్సులు, అనుమతి ఉన్నాయని భావించి, ఆ రోజే గ్రంథరచనకు శ్రీకారం చుట్టాడు.

కానీ, శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ విరచిత “అమృతానుభవం” అనే గ్రంథంలో పరమోత్కృష్టమైన పారమార్థిక రహస్యాలు అత్యంత నిగూఢమైన రీతిలో ప్రస్తావించబడి ఉంటాయి. శుద్ధ చైతన్య స్థితిలో సదా ఓలలాడే తమ స్వీయ స్థితిని ముచ్చటిస్తూ, ఆ పరమోత్కృష్ట స్థితి యొక్క అనుభవాన్ని ఓవిల రూపంలో వివరిస్తూ, మరాఠీ భాషలో ఎంతో నిగూఢమైన రీతిలో జ్ఞానేశ్వర్ మహారాజ్ ఆ గ్రంథాన్ని రచించారు. ఆ గ్రంథంలో భావ సంక్లిష్టత అత్యంత కఠినమైన రీతిలో ఉంటుంది. మరి అటువంటి ఉచ్చశ్రేణి





గ్రంథాలపై వ్యాఖ్యానం వ్రాయడమంటే ఎంతటి కఠినమైన, క్లిష్టమైన ప్రక్రియో మనకు సులభంగానే బోధపడుతుంది.

తాను “అమృతానుభవం” గ్రంథంపై వ్రాయతలపెట్టిన వ్యాఖ్యాన గ్రంథానికి “అమృతానుభవ భావార్థ మంజరి” అని నామకరణం చేసి, పండరీపురంలోనే బస చేసి వ్యాఖ్యానాన్ని వ్రాయడానికి ఉపక్రమించాడు. కానీ, ప్రతి ఓవిలోని భావ సంక్లిష్టత, ఒక్కొక్కసారి పరస్పర విరుద్ధమైన భావాలకు, ఉపమానాలకు ఒకే భావానికి ఉపయోగిస్తూ శ్రీ జ్ఞానేశ్వర్ వ్రాసిన శైలి తీవ్ర అయోమయానికి, గందరగోళానికి గురిచేసింది. ఇక లాభం లేదనుకొని, ఈ గ్రంథ రచన ఒడ్డున పడాలంటే శ్రీ సాయి చరణ సన్నిధిని ఆశ్రయించక తప్పదనే భావంతో శిరిడీ పయనమయ్యాడు. షిరిడీలోనే ఉండి బాబా అనుగ్రహంతో, సహాయంతో గ్రంథరచన పూర్తి చేయాలని నిర్ణయించుకున్నాడు. షిరిడీ వచ్చి బాబాను దర్శించుకొని, జరిగిన విషయమంతా బాబాకు నివేదించి, బాబా అనుగ్రహాన్ని, ఆపన్న హస్తాన్ని అర్థించాడు. అప్పుడు బాబా నవ్వుతూ, తమ వరదహస్తాన్ని దాసగణు శిరస్సుపై ఉంచి “మంచిది గణూ” అని ఆశీర్వదించారు.

అప్పటి నుండి, షిరిడీలోని విఠల మందిరంలో బస చేసి, ఆ గ్రంథ రచనకు పూనుకున్నాడు. తరువాత బాబా తమదైన అద్భుతరీతిలో దాసగణుచే ఆ గ్రంథ రచనను పూర్తి చేయించిన వైనాన్ని తెలుసుకుంటే, సద్గురువు తమ సంకల్పంచే సచ్ఛిష్యునిచే ప్రారంభింపజేసిన పారమార్థిక కార్యాన్ని, అన్నీ తామై పూర్తి చేయించిన తీరు అవగతమవుతుంది. అంతే కాదు, ప్రతిరోజు బాబా-ఒక్కొక్కసారి ఆధ్యాత్మిక రహస్యాలు దాగియుంటాయనే సత్యం స్పష్టమవుతుంది. “వేదవేదాంగాలు కూడా వర్ణించలేక పోయిన భగవత్ తత్వం శ్రీ సాయి రూపంలో అత్యంత భక్త సులభునిగా మన మధ్య నడయాడారా” అని మనసు అబ్బురపడుతుంది. “భగవంతుడు ఇంత సామీప్యుడా” అని అచ్చెరువొందుతుంది.

**(సశేషం)**

శ్రీరస్తు ! శుభమస్తు !!

# శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమం



## శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్
## సాయిధామం

యాదాద్రి భువనగిరి జిల్లా ద్వితీయ అనుబంధ శాఖ
రైల్వేగేటు దగ్గర, అబ్బూరు రోడ్డు, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా.

## దశమ వార్షికోత్సవ ఆహ్వానం

శ్రీ కోదండ రామసాయి సన్నిధానం ఆశ్రమంలో
**దశమ వార్షికోత్సవం - 2024 ఆగస్టు 14, 15 బుధ, గురువారాలలో...**

భక్త మహాశయులందరికి శ్రీ సాయిరక్ష

సత్తెనపల్లిలోని శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం శ్రీ సాయిదత్త పీఠం, శ్రీ సాయినాథ క్షేత్రం (రేపల్లె శాఖ), శ్రీ సాయీ సేవాసమితి ట్రస్టు, సాయిధామం (యాదాద్రి భువనగిరి జిల్లా) వ్యవస్థాపకులు పరమ పూజ్య గురుదేవులు సాయి సంకీర్తులు, పరమపూజ్యులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యవదానంద ప్రభూజీ వారి ఆధ్వర్యంలో శ్రీ ఆనందసాయి ప్రభు మందిరంలో శ్రీ గణపతి, దత్తాత్రేయ స్వామి, **శ్రీ సాయిబాబా వారు** ప్రతిష్ఠింపబడి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2024 ఆగస్టు 14, 15 తేదీలలో దశమ వార్షికోత్సవాలు జరిపించాలని శ్రీ సాయిదత్త పీఠాధిపతులు, శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీ రామానంద ప్రభూజీ, శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు వారు సంకల్పించారు. కావున భక్తులు ఈ ఉత్సవ కార్యక్రమాలలో పాల్గొని సాయి నాథుని కృపకు పాత్రులు కాగలరని ఆహ్వానిస్తున్నాము.

**ఆగస్టు 14, 2024 బుధవారం**

ఉదయం : గం. 5-15 ని॥లకు కాకడ హారతి
6-00 గం.లకు ధ్వజారోహణం
7-00 గం.లకు ఆనందసాయి ప్రభువారికి సహస్ర కలశాలతో అభిషేకం
(ప్రతి ఇంటి నుండి కలశంతో గంగా జలం తీసుకుని వచ్చి మీ స్వహస్తాలతో అభిషేకం చేసే అవకాశం)
8-00 గం.లకు అష్టోత్తర శతనామ పూజ
10-00 గం.లకు సాయి చాలీసా పారాయణ





**ఆగస్టు 15, 2024 గురువారం**

ఉదయం : గం. 5-15 ని॥లకు కాకడ హారతి
6-00 గం.లకు ఆనందసాయి ప్రభువారికి పంచామృత క్షీరాభిషేక జలాభిషేకాలు
7-00 గం.లకు అష్టోత్తర శతనామ పూజ
గం. 9-30 ని॥లకు వివిధ రకాల పుష్పాలతో సామూహికంగా సహస్ర నామ పూజ
గం. 11-30 ని॥లకు శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీ రామానంద ప్రభూజీ వారి ప్రవచనం
12-00 గం.లకు మహాహారతి.
గం. 12-30 ని॥లకు ఆశ్రమము మాటగా...
**1-00 గం.లకు అన్నప్రసాద వితరణ.**

ఈ సంవత్సరం వార్షికోత్సవం ఏకాదశి మరియు గురువారం రావడం చాలా విశేషం. కావున ఈ విశేషమైన రోజున త్రిమూర్తి అవతారం, సర్వదేవతా స్వరూపుడు, దర్శన మాత్రాన కోరిన కోర్కెలు తీర్చే శ్రీ ఆనందసాయి ప్రభువారికి సహస్ర నామాలతో పుష్పార్చన చేయడం ఎంతో విశేషమైన ఫలితం వస్తుంది కావున భక్తులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోగలరు.

సహస్రనామ పుష్పార్చన పూజలో భక్తులు ఎవరైనా పూలు, పూజా ద్రవ్యములు తీసుకుని వచ్చి పాల్గొనవచ్చును.

సహస్రనామ పుష్పార్చన పూజలో పాల్గొనే భక్తులు విస్తరాకు, 1 1/4 కేజీ బియ్యం, పూలు, కొబ్బరికాయ, తాంబూలం, ఆచమనానికి (2 గ్లాసులు, 1 ప్లేటు, 1 స్పూన్), పూజా ద్రవ్యములతో పాల్గొనవచ్చును.


వివరాలకు:
**ఆలయ పూజారి గారు - 9391377232**

**సాయినాథుని సూక్తి: 1 రూపాయి నాకు ఇస్తే 10 రూపాయలు తిరిగి నేను నీకు ఇవ్వవలసి ఉంటుంది.**


ఈ కార్యక్రమానికి దాతలు ధన, వస్తురూపేణా విరాళాలు అందించే వారికి హృదయపూర్వక స్వాగతం. భక్తులంతా ఈ మహదవకాశాన్ని సద్వినియోగపరచుకొని ధన్యులు కావలసినదిగా ఆహ్వానిస్తున్నాము.



శ్రీ మాతాజీ గారు



**అందరికీ ఆహ్వానము**



శ్రీ సాయి దత్త పీఠాధిపతులు
శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీ రామానంద ప్రభూజీ వారు

ఇట్లు:
**శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్ - సత్తెనపల్లి శాఖ**
రైల్వేగేటు దగ్గర, అబ్బూరు రోడ్డు, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా.

**ధర్మాన్ని పాటించండి - ధర్మాన్ని ప్రేమించండి - దేశాన్ని రక్షించండి**